క్లుప్తంగా

ఘనంగా హరిద్ర శృంగార్చన



పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలో వేంచేసిన శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి మాట్లాడుతూ అమ్మవారి దేవాలయంలో ప్రతి శుక్రవారం మగ పిల్లలకు వివాహం జరగాలని ప్రత్యేకంగా పసుపు కొమ్ములతో హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని, భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

పడమటిపాలెంలో ఉచిత పశు వైద్య శిబిరం

భట్టిప్రోలు: ఆళ్లమూడి పశు వైద్యశాల ఆధ్వర్యంలో శుక్రవారం కోనేటిపురం రైతు భరోసా కేంద్రం పరిధిలోని పడమటిపాలెంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ మోర్ల వెంకటేశ్వరమ్మ ప్రారంభించారు. పశు వైద్యాధికారి డాక్టర్ జగదీష్ మాట్లాడుతూ ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు మాత్రమే మేత కోసం పశువులను బయటికి వదలాలని తెలిపారు. పశువుకు వడ దెబ్బ తగిలినప్పుడు శరీరంపై తడి గోతాలు కప్పి, నీడ ప్రదేశానికి తరలించి వెంటనే పశు వైద్యుడిని సంప్రదించాలని సూచించారు. శిబిరంలో 40 పశువులను పరీక్షించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు వెంకటేశ్వరరావు, గ్రామస్తులు మోర్ల శ్రీనివాసరావు, సత్యన్నారాయణ, సిబ్బంది వెంకటేశ్వరరావు, గాయత్రి, సుదర్శన్, యశ్వంత్ పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

నగరం: విద్యార్థులు దాతలు అందించిన పరీక్ష కిట్‌లను సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌ఎం మద్ది సత్యనారయణ పేర్కొన్నారు. స్థానిక తడవర్తి బాపయ్య స్మారకోన్నత పాఠశాలలో శుక్రవారం పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి కిట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. 25 మంది విద్యార్థులకు కిట్‌లను పంపిణీ చేసినట్లు తెలిపారు. సర్పంచ్ హేమామృతం, వైఎస్సార్ సీపీ నాయకులు ఆనంద్, రాఘవేంద్ర, బాబురావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు కుర్చీల బహూకరణ



భట్టిప్రోలు: భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని 17 అంగన్‌వాడీ కేంద్రాలకు 150 కుర్చీలను గ్రామ సర్పంచ్ దారా రవి కిరణ్మయి శుక్రవారం అందజేశారు. చిన్నారులు నేలపై కూర్చొకుండా కుర్చీలను అందజేసినట్లు ఆమె తెలిపారు. తన పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్‌చేసి సిబ్బందికి, చిన్నారులకు అందజేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీరాములు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డి. బేబి స్వర్ణలత, పంచాయతీ కార్యదర్శి పిట్ల శ్రీనివాసరావు, సిబ్బంది రాఘవయ్య, మాతంగి రత్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్త్ అవర్ పాటిద్దాం



బాపట్ల అర్బన్ : ప్రపంచం ఎదుర్కొంటున్న అతి పెద్ద సవాలు భూ తాపమని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.మాల్యాద్రి అన్నారు. శుక్రవారం ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో ఎర్త్ అవర్ పాటిద్దామనే నినాదంతో ముద్రించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మట్లాడారు. భూ తాపాన్ని నియంత్రించడానికి ఇంధనం, నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. శనివారం రాత్రి 8:30 నుంచి 9:30 గంటల వరకు లైట్లు ఆపివేసి, ఎర్త్ అవర్ పాటిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఫోరం కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు, అధ్యాపకులు అబ్దుల్ కలాం, విద్యార్థులు పాల్గొన్నారు.

సత్తా చాటిన భట్టిప్రోలు విద్యార్థులు

భట్టిప్రోలు: ఎన్‌ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ స్కాలర్ షిప్)కు తొమ్మిది మంది విద్యార్థులు మండలం నుంచి ఎంపికయ్యారు. ఐలవరం జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి వి.లక్ష్మయ్య, వి.శృతిహాసిని, పి.సుమశ్రీ, సీహెచ్ నందిని, కె.జోతిష్, జి.దీప్తి నాగ కౌసల్య, పల్లెకోన హైస్కూల్ నుంచి బందెల మల్లిక, పి.వెంకటహర్ష, ఆరుమళ్ల దీప్తి ఎంపికై నట్లు ప్రధానోపాధ్యాయులు కాటూరి లక్ష్మీన్నారాయణ, వి.నాగేశ్వరరావు తెలిపారు. విద్యార్థులను ఎంఈఓ పులి లాజర్, సర్పంచులు మాచర్ల కోటేశ్వరరావు, బొల్లెద్దు రాజమ్మ, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, ఎంపీటీసీ సభ్యులు మురుగుడు శ్రీనివాసరావు, దున్నా తిరుపతి బాబు అభినందించారు.

సేవల నిలయం.. సచివాలయం

ఇది నాలుగేళ్ల క్రితం మాట. ఏ చిన్న పనికైనా గ్రామీణులు మండల, జిల్లా కేంద్రాలకు పరుగు తీయాల్సి వచ్చేది. పని కాకపోతే మరుసటి రోజు అన్ని పనులు ఆపుకుని వెళ్లాలి. ఇలా రోజుల తరబడి తిరిగినా.. సమస్యకు పరిష్కారం లభించేది కాదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గాంధీ మహాత్ముడి ఆశయ సాధనలో భాగంగా.. పాలనను ప్రజలకు చేరువ చేసింది. గ్రామ సచివాలయ వ్యవస్థతో.. పల్లె దాటే పనిలేకుండా.. సచివాలయంలోనే దాదాపు 536 సేవలను అందుబాటులోకి తెచ్చింది. 15 నిమిషాల నుంచి 72 గంటల్లోనే సమస్యలకు పరిష్కారం లభిస్తోంది.



ముత్తాయపాలెంలో గ్రామ సచివాలయం

- గ్రామ సచివాలయంలో 536 సేవలు
- 15 నిమిషాల నుంచి 72 గంటల్లో సమస్యలకు పరిష్కారం
- ప్రభుత్వ ఆదేశాల మేరకు నిత్యం ఉన్నతాధికారుల పర్యవేక్షణ
- ఆకస్మిక తనిఖీలు చేస్తున్న ప్రజా ప్రతినిధులు
- ప్రజలకు గ్రామంలోనే మెరుగైన సేవలు

బాపట్ల అర్బన్: మారుమూల పల్లెల్లో కూడా సచివాలయం ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు సక్రమంగా, వేగంగా ప్రస్తుతం అందుతున్నాయి. గ్రామ, వార్డు సచివాలయాల్లో 470 నుంచి 536 సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఏ సేవను.. ఎన్ని గంటలలో, రోజుల్లో అందించాలనే అంశంపై సర్వీస్ చార్జు సిద్ధం చేశారు. అత్యధిక సేవలు 72 గంటల్లోనే అందేలా రూపొందించారు. 11 ప్రభుత్వ శాఖలకు చెందిన 536 సేవలను ప్రజలకు అందించాలనేది సచివాలయాల ఉద్దేశం.

15 నిమిషాల్లో అందే సేవలు

బాపట్ల నియోజకవర్గంలో గ్రామ, వార్డు సచివాలయాలు 68 ఉన్నాయి. సచివాలయానికి వచ్చిన 15 నిమిషాల్లోనే కొన్ని సేవలు పొందవచ్చు. 1 బీ, అడంగల్, ఆధార్, రేషన్ కార్డ్ ప్రింట్, టైటిల్ డీడ్, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ సర్టిఫికెట్ కాపీ, విద్యుత్ కనెక్షన్ కేటగిరి మార్పు వంటివి పావు గంటలో పొందవచ్చు. ఇలా 47 సేవలు అప్పటికప్పుడు అందిస్తున్నారు. 148 సేవలు మాత్రం మూడు రోజుల్లో, (72గంటల్లో) పరిష్కరిస్తారు. మిగిలిన వాటికి మూడు రోజుల అనంతరం ఒక్కో సేవకు నిర్ణీత వ్యవధి ఉంది. ఈ సేవలకు ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు చేశారు.

అన్ని సౌకర్యాలతో సిద్ధం

ప్రతి సచివాలయాల్లో కంప్యూటర్, ఇంటర్నెట్ సదుపాయం, బల్లలు, కుర్చీలు మొబైల్స్, అందించారు. దీంతో ప్రింట్ తీసిన తరువాత కార్డులను అందిస్తారు. వివిధ సంక్షేమ పథకాలు ప్రజల ఇంటి వద్దకే చేర్చేందుకు వలంటీర్లకు మొబైల్ ఫోన్లు ఇప్పటికే పంపిణీ చేశారు.

రేషన్ కార్డులో మార్పులు, చేర్పులు

రేషన్ కార్డుల్లో కొత్తవారిని చేర్చడం వంటి సమస్యలతో ప్రజలు ఇబ్బందుదు పడ్డారు. ప్రస్తుతం కొత్త వారిని చేర్చేందుకు ఆప్షన్ రావడంతో సమస్యలు పరిష్కారమవుతున్నాయి. అలాగే హౌస్ హోల్డ్ మ్యాప్‌లో కూడా మార్పులకు, చేర్పులకు అవకాశం రావడంతో ప్రజలకు ఇక్కట్లు తప్పాయి.

పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్న సేవలు

క్యాస్ట్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్స్, ఆధార్ ఈ-కేవైసీ, ఆదాయ, 1 బీ, అడంగల్, ఎఫ్‌ఎంబీ, పట్టాదార్ పాస్ బుక్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, సదరం స్లాట్ బుకింగ్, తిరుపతి, ముఖ్యమైన దేవాలయాల రూముల బుకింగ్, కొత్త రైస్ కార్డ్ యాడింగ్, డేలేటింగ్, బర్త్, డెత్ సర్టిఫికెట్స్ సేవలు అందుతున్నాయి. అలాగే ఈసీ, డ్రైవింగ్ లైసెన్స్ స్లాట్ బుకింగ్ సర్వీసులు అందుతున్నాయి. ప్రస్తుతం రూ.40లకు 1బీ, అడంగల్, రూ. 50లకు క్యాస్ట్, ఆదాయ, ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్లు ఇస్తున్నారు.



దరఖాస్తులు అప్‌లోడు చేస్తున్న డిజిటల్ అసిస్టెంట్

సచివాలయాల్లో మెరుగైన సేవలు



సచివాలయాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయి. ప్రస్తుతం అన్ని రకాల సేవలు అందిస్తున్నారు. ప్రజలు ఇబ్బంది పడకుండా వలంటీర్ల ద్వారా సేవలు పొందవచ్చు. ఏదైనా సర్టిఫికెట్ కావాలంటే ప్రభుత్వం నిర్ణయించిన ధరకు అందజేస్తారు. ఒక్క రూపాయి కూడా అదనంగా తీసుకోరు. రైల్వే టికెట్స్ కూడా బుకింగ్ చేసుకోవచ్చు.

– అచ్యుతుని రాధాకృష్ణ, ఎంపీడీఓ, బాపట్ల

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి

భట్టిప్రోలు: ఎదుగుదల లోపం, తక్కువ బరువున్న పిల్లలను గుర్తించి వారికి అదనపు పౌష్టికాహారం అందించాలని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి పేర్కొన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వెల్లటూరు పీహెచ్‌సీ పరిధిలోని అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, సచివాలయ సిబ్బందితో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ సంపూర్ణ పోషణ, గోరు ముద్ద పథకాల అమలులో.. అంగన్‌వాడీ కార్యకర్తలు నిస్వార్థంగా పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా వరల్డ్ టీబీ డే సందర్భంగా గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, ఈఓపీఆర్డీ సీహెచ్ శేఖర్, పీహెచ్‌సీ వైద్యురాలు సీహెచ్ రామలక్ష్మి, సూపర్‌వైజర్స్ ఎం.ప్రసాదరావు, శ్రీనివాసరావు, హెచ్‌ఈలు సాంబశివరావు, హెచ్‌వీలు రాజ్యలక్ష్మి, బుల్లెమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డి.మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార పక్షోత్సవం

పెరవలి(వేమూరు): చిరు ధాన్యాల్లో పోషకాలుంటాయని అంగన్‌వాడీ సూపర్ వైజర్ రమణమ్మ తెలిపారు. శుక్రవారం పెరవలి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవం నిర్వహించారు. చిరు ధాన్యాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రత్న కుమారి, సీహెచ్ దుర్గా, డి.సురేష్‌బాబు, బి.నాగ లక్ష్మి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ, జెడ్పీటీసీ, సిబ్బంది



పక్షోత్సవంలో అవగాహన కల్పిస్తున్న సూపర్ వైజర్

మందులతో టీబీ నుంచి విముక్తి



కొల్లూరులో వైద్య, ఆరోగ్య సిబ్బంది ప్రదర్శన



ప్రదర్శనలో డాక్టర్ ఉషారాణి తదితరులు

నిజాంపట్నం: రెండు వారాలకు పైబడి దగ్గు వస్తుంటే తప్పనిసరిగా గల్ల పరీక్ష చేయించుకోవాలని కూచినపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఉషారాణి పేర్కొన్నారు. పీహెచ్‌సీలో శుక్రవారం ప్రపంచ క్షయ నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. టీబీ బాధితులు ప్రభుత్వం అందించే ఉచిత మందులతో వ్యాధి నయం చేసుకోవచ్చని తెలిపారు. అధిక రోజులు దగ్గు, మెడమీద కణతులు వంటి పలు అనుమానిత లక్షణాలు ఉంటే తప్పనిసరిగా వైద్యులను సంప్రదించాలని కోరారు. ఈ సందర్భంగా సిబ్బందితో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ మురళీకృష్ణ, సీహెచ్‌ఓ, పీహెచ్‌ఎన్ తదితరులున్నారు.

క్షయ నివారణకు సహకరించాలి

బాపట్ల: క్షయ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని వెదుళ్ళపల్లి ప్రాథమిక వైద్యశాల డాక్టరు మానసా ప్రియదర్శిని పేర్కొన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా వెదుళ్ళపల్లిలో శుక్రవారం ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఓ చంద్రశేకర్, పీహెచ్‌ఎన్ పద్మ, ఎన్.రవిశేఖర్, రెబ్బకా, మీనాకుమారి, ఏఎన్‌ఎంలు, ఆశలు పాల్గొన్నారు.



ర్యాలీలో వెదుళ్ళపల్లి వైద్యశాల సిబ్బంది

తక్షణ చికిత్స అవసరం

కొల్లూరు : క్షయవ్యాధిపై నిర్లక్ష్య ధోరణిని విడనాడి తక్షణం అవసరమైన మందులు వాడాలని కొల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి సుష్మ అన్నారు. శుక్రవారం ప్రపంచ టీబీ డేను పురస్కరించుకుని కొల్లూరులో ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం క్షయ వ్యాధి నివారణ అవసరమైన మందులను పూర్తిగా ఉచితంగా అందజేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిబ్బంది టి.గాలీబు, ఎం. ముత్యాలరావు, ఎస్‌కే సుబ్బారెడ్డి, కేవీ విజయలక్ష్మి, శ్రీనివాస్, మేరి, సువార్త పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజించాలి

నగరం: దైవాన్ని భక్తిశ్రద్ధలతో పూజిస్తే సుఖ సంతోషాలతో జీవించవచ్చునని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు పేర్కొన్నారు. శుక్రవారం ఉల్లిపాలెంలో శ్రీ కోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో ఆయన పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తి భావం పెంపొందించే విధంగా రామ మందిరాలు నిర్మించడం అభినందనీయమన్నారు. గ్రామస్తుల సహకారంతో ఆలయనిర్మాణానికి కృషి చేసిన కమిటీ సభ్యులను ఎంపీ మోపిదేవి అభినందించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, ఆలయ కమిటీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఎంపీ మోపిదేవి, దేవినేని

వేరుశనగ రైతులను ఆదుకోవాలి

చెరుకుపల్లి: అకాల వర్షాలతో వేరుశనగ పంట నష్టపోయిన తమకు నష్టపరిహారం అందించి, ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. మండలంలోని కుంచలవారిపాలెం, రాంబొట్లపాలెం, తుమ్మలపాలెం, కావూరు, బలుసులపాలెం, ఆరుంబాక, గుళ్లపల్లి పొన్నపల్లి, నడింపల్లి, రాజవోలు పంచాయతీల పరిధిలో 8,008 ఎకరాల్లో వేరుశనగ సాగు చేస్తున్నారు. మండల వ్యవసాయ శాఖాధికారి బాలాజీ గంగాధర్ స్పందిస్తూ.. అకాల వర్షాలకు కొన్ని పల్లపు చేలల్లో, కాలువ పక్కన పొలాల్లో మాత్రమే నీరు నిల్వ ఉండి శనక్కాయ కుళ్లి పోతుందన్నారు. జరిగిన నష్టాన్ని అంచనా వేసి, ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామన్నారు.



కుళ్లి పోయిన వేరుశనగ పైరును చూపుతున్న ఆరేపల్లి రైతులు

అవార్డు గ్రహీతలకు సన్మానం

భట్టిప్రోలు: గ్రామీణ ప్రాంతాల్లో జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించి, అవార్డులు అందుకున్న ఆళ్లమూడి, కోనేటిపురం పంచాయతీ సిబ్బందిని శుక్రవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు టి.ఉదయభాస్కరి ఘనంగా సన్మానించారు. ఈఓపీఆర్డీ సీహెచ్ శేఖర్, ఆళ్లమూడి సర్పంచ్ పెద్దిశెట్టి రాంబాబు, పంచాయతీ కార్యదర్శులు పి.ప్రదీప్ కుమార్, అడిగోపుల చిన వెంకటేష్‌బాబు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ బి.విజయ సారథి, వలంటీర్ వై.ప్రసాద్, క్లాప్ మిత్ర ఎస్.వెంకటేశ్వరరావు సన్మానం అందుకున్నారు. ఎంపీపీ మాట్లాడుతూ ఈ రెండు గ్రామాలను ఆదర్శంగా తీసుకుని మిగతా 13 గ్రామాల పురోగతి చూపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు నన్నెపాముల చంటి, పార్టీ నాయకులు దావూరి నాగమల్లేశ్వరరావు, టి.బాలాజీ, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందిని సన్మానిస్తున్న ఎంపీపీ లలిత కుమారి, జెడ్పీటీసీ ఉదయ భాస్కరి

కళాకారుడు నాగేశ్వరరావుకు సన్మానం

తెనాలిఅర్బన్: నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో శుక్రవారం కేడీ నంబర్ 1 చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. అనంతరం పౌరాణిక నాటక కళాకారుడు దానబోయిన నాగేశ్వరరావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో దేవబత్తుని ఉమా మహేశ్వరరావు, తుమ్మల సత్యనారాయణ, వైఎల్.చౌదరి, శరణ్ వెంకటేశ్వర ప్రసాద్, సీహెచ్ శ్రీనివాసరావు, పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, ఈదర శ్రీనివాసరావు, దేవరపల్లి భవాని, ఎన్టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, దేవిశెట్టి భాస్కర్, వేమలపల్లి మల్లికార్జునరావు, ఆరాధ్యుల ఆదినారాయణ, ముళ్లపూడి వెంకట్, నల్లూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లో చోరీ

తెనాలిరూరల్: తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని రజక చెరువు సమీపంలో నివసించే ఓ కుటుంబం పొన్నూరులోని బంధువుల ఇంటికి ఇటీవల వెళ్లింది. తిరిగి శుక్రవారం రాగా తలుపునకు వేసి ఉన్న తాళం తీసి ఉంది. దీంతో వారు పోలీసులను ఆశ్రయించారు. టూ టౌన్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇంట్లో ఉంచిన రూ.20 వేల నగదు, సుమారు రూ.రెండు లక్షలు విలువైన బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు అపహరణకు గురైనట్లు గుర్తించారు. కేసు నమోదు చేసిన పోలీసులు, దర్యాప్తు చేస్తున్నారు.

బటన్ నొక్కి..మాట నిలబెట్టుకునేందుకు

- మూడో విడత వైఎస్సార్ ఆసరా నగదు నేడు జమ
- 'వేమూరు'లో 5,169 స్వయం సహాయక సంఘాలు
- జమ కానున్న రూ.47.33 కోట్లు

వేమూరు: వైఎస్సార్ ఆసరా పథకం కింద ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్వయం సహాయ సంఘాలకు మూడో విడత రుణ మాఫీ నిధులు విడుదల చేయనున్నారు. డ్వాక్రా సంఘాల సభ్యులు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను నాలుగు విడతల్లో మాఫీ చేస్తామని ఎన్నికల ముందు ఆయన వాగ్దానం చేశారు. ఇప్పటికే రెండు విడతల్లో నగదు జమ చేశారు. ఈ నెల 25న, శనివారం మూడో విడత నగదును ప్రభుత్వం విడదల చేయనుంది. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ గతేడాది డిసెంబరు నాటికే లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేసింది. జాబితాను గ్రామ సచివాలయాల్లో ప్రదర్శించింది. డ్వాక్రా సంఘాల సభ్యులకు బయోమెట్రిక్ తప్పనిసరి చేసింది ప్రభుత్వం. వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బంది సంఘాల సభ్యులతో బయో మెట్రిక్ చేయించారు. మార్పులు చేర్పులు అనంతరం జాబితాను సిద్ధం చేశారు. వేమూరు నియోజకవర్గంలో 5,169 స్వయం సహాయక సంఘాలున్నాయి, మూడో విడత రూ.47.33 కోట్లు జమ కానుంది. వేమూరు మండలంలో 992 సంఘాలకు రూ.7,89.23 లక్షలు, కొల్లూరులో 1215 సంఘాలకు రూ.1308.33 లక్షలు, భట్టిప్రోలులో 1008 సంఘాలకు రూ.811.84 లక్షలు, అమర్తలూరులో 968 సంఘాలకు రూ.859.75 లక్షలు, చుండూరులో 986 సంఘాలకు రూ.964.66 లక్షలు జమకానుంది.



వేమూరులో మహిళ సంఘాలకు అవగాహన కల్పిస్తున్న సభ్యులు

26 నుంచి గ్రామాల్లో ఉత్సవాలు

ఈ నెల 25న స్వయం సహాయక సంఘాల మహిళల ఖాతాల్లో నగదు జమ కానుంది. 26 నుంచి ఏప్రిల్ 5వ తేదీ గ్రామాల్లో ఉత్సవాలు నిర్వహించనున్నాం. వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడత నగదును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విడుదల చేయనున్నారు.

– గాలి రాము, ఏపీఎం, ఇందిర క్రాంతి పథం, వేమూరు

పది రోజుల పాటు ఉత్సవాలు

ఆదివారం నుంచి ఏప్రిల్ 5 వరకు పది రోజుల పాటు వైఎస్సార్ ఆసరా సంబారాలు గ్రామాల్లో సాగేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామీణాభివృద్ధి సంస్థ పర్యవేక్షణల్లో సంబారాలు ఘనంగా నిర్వహించేందుకు క్షేత్రస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ప్రజా ప్రతినిధుల సమన్వయంతో నిర్వహించాలని మండలస్థాయి అధికారులకు ఆదేశాలు పంపించడం జరిగింది.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

పెరవలి(వేమూరు): గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం సాయంత్రం 4 గంటలకు పెరవలి గ్రామంలో నిర్వహించడం జరుగుతుందని మండల పార్టీ అధ్యక్షుడు బొల్లిముంత ఏడుకొండలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

నేటి నుంచి పశువులకు వ్యాధి నిరోధక టీకాలు

కర్లపాలెం: గాలి కుంటు వ్యాధి నివారణకు శనివారం నుంచి పశువులకు టీకాలు వేయనున్నామని కర్లపాలెం మండల పశు వైద్యాధికారి ఎం.రేచల్ దివ్య శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25 నుంచి ఏప్రిల్ 24 వరకు మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నట్లు ఆమె తెలిపారు. రైతులందరూ తమ పశువులకు టీకాలు వేయించాలని పేర్కొన్నారు.

శ్రవణానందంగా ప్రవచనం



ఐలవరం(భట్టిప్రోలు): ఐలవరంలోని శ్రీ సీతారామ మందిరంలో శ్రీమద్రామాయణ సప్తాహ ప్రవచన కార్యక్రమం టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమాలు విశేషంగా భక్తులను ఆకట్టుకుంటున్నాయి. టీటీడీ అయిదు జిల్లాల సూపరింటెండెంట్ ఎం.క్రాంతి కుమార్ ప్రవచనాలు ఆలోచింపజేస్తున్నాయి. స్వామి వార్లకు మహిళలు సామూహిక హారతులిచ్చారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమ శంకరరావు, డి.సత్యన్నారాయణ, ఎం. రంగారావు, కేవీబీ రమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం

వేమూరు: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహించడం జరుగుతుందని ఆసుపత్రి వైద్యాధికారి మధు సూదనరావు శుక్రవారం ఒక ప్రటకనలో తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున హాజరవుతారని, కమిటీ సభ్యులందరూ.. హాజరు కావాలని ఆయన తెలిపారు.

సెల్‌ఫోన్ టవర్ పేరుతో.. నగదు స్వాహా

కొల్లూరు: ఓ ప్రముఖ కంపెనీ సెల్‌ఫోన్ టవర్ ఏర్పాటు చేస్తామని, రూ.లక్షల అద్దె ఆశ చూపి ఓ వ్యక్తి నుంచి దఫాల వారీగా నగదు స్వాహా చేసిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. అయితే ఈ ఘటనపై బాధితుడు పోలీసులను ఆశ్రయించినా.. కేసు నమోదు చేయకపోవడం విశేషం. వివరాల మేరకు.. మండలంలోని పెదలంకకు చెందిన ఓ వ్యక్తికి గురువారం అపరిచిత వ్యక్తి నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. ఫోన్ చేసిన వ్యక్తి.. సదరు వ్యక్తి స్థలంలో ఓ ప్రముఖ కంపెనీకి చెందిన సెల్‌ఫోన్ టవర్ నిర్మాణం చేపడతామని, ఏడాదికి రూ.20 లక్షలు అద్దె రూపంలో చెల్లింపులు చేస్తామని నమ్మబలికాడు. ముందస్తుగా ట్యాక్స్ చెల్లింపులు చేపడితే అగ్రిమెంట్ సిద్ధం చేస్తామంటూ.. ఫోన్‌పే రూపంలో శుక్రవారం మధ్యాహ్నం వరకు రూ.47 వేలు పలు దఫాలుగా వసూలు చేశాడు. మరో మారు నగదు చెల్లిస్తే.. ఫైనల్ అగ్రిమెంట్ సిద్ధమవుతుందని, సెల్‌ఫోన్ టవర్ నిర్మాణానికి ఉన్న అడ్డంకులు తొలగిపోతాయని నమ్మించేందుకు ప్రయత్నించాడు. అనేక దఫాలుగా నగదు చెల్లింపులు చేసిన.. బాధిత వ్యక్తికి అనుమానం రావడంతో కొల్లూరులోని ఆ ప్రముఖ సెల్‌ఫోన్ నెట్‌వర్క్ కంపెనీకి చెందిన షోరూంలో సంప్రదించాడు. పైస్థాయి సిబ్బందితో మాట్లాడటంతో సెల్ ఫోన్ టవర్ నిర్మాణం పేరుతో వచ్చిన ఫోన్ కాల్‌కు.. నగదు వసూలుకు ఎటువంటి సంబంధం లేదని సిబ్బంది తేల్చి చెప్పారు. వారి సమాధానంతో మోసపోయానని బాధితుడు గుర్తించాడు. దీంతో కొల్లూరు పోలీసులను ఆశ్రయించానని, తనకు ఫోన్ చేసిన వ్యక్తుల నంబర్లు, పోన్ పే చేసిన ఫోన్ నంబర్ వివరాలను అందజేసినట్లు బాధితుడు తెలిపాడు. అయితే నగదు స్వాహా విషయంపై ఎటు వంటి కేసు నమోదు చేయలేదని ఏఎస్‌ఐ బాబురావు తెలిపారు.